ప్రజాశక్తి

శుక్రవారం 22 డిసెంబర్ 2023

I

అల్లూరి సీతారామరాజు



ఎర్రవరంలో గిరిజనుల నిరసన

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి వస్తున్న సీఎం జగన్మోహన్ రెడ్డి ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేసే ప్రకటన చేయాలని ఎర్రవరంలో చుట్టుపక్కల గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. గిరిజనులకు నష్టదాయకం చేసే పనులు చేస్తూనే సవితి తల్లి ప్రేమ చూపిస్తున్న జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గిరిజన విద్యార్థులతో కేక్ కటింగ్ చేయించడంపై గ్రామస్తులు మండిపడ్డారు. ఎన్ని ఉద్యమాలు, పోరాటాలు చేసినా హైడ్రో ప్రాజెక్టు అనుమతులు రద్దుపై రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందన లేకపోవడం బాధాకరన్నారు. ఈ కార్యక్రమంలో గూడెపు రాజు, చిన్నరాజు, గోపి, మంగరాజు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న గిరిజనులు

పిల్లలు.. భవిష్యత్తు వెలుగులు

-విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు దిశగా అడుగులు -చింతపల్లిలో ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో సిఎం జగన్



విద్యార్థులతో ముచ్చటిస్తున్న సిఎం జగన్



పిల్లలతో సెల్ఫీ తీసుకుంటున్న సిఎం జగన్

ప్రజాశక్తి - పాడేరు టౌన్, చింతపల్లి విలేకరులు

పిల్లలు... భవిష్యత్తు వెలుగులని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అన్నారు. స్థితిమంతుల పిల్లలకు ధీటుగా పేదింటి పిల్లలను నిలపడమే తమ ధ్యేయమని ఉద్ఘాటించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న 4,34,185 మంది విద్యార్థులకు రూ.620 కోట్ల వ్యయంతో బైజూస్ ప్రీలోడెడ్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌ల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాలోని చింతపల్లిలో గురువారం సిఎం లాంఛనంగా ప్రారంభించారు. వందలాది మంది పిల్లలు రాకతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. అదే క్రమంలో సిఎం పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని స్థానికంగా భారీగా ఏర్పాట్లు చేశారు. ట్యాబ్‌ల పంపిణీ సందర్భంగా సిఎం మాట్లాడుతూ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని తెలిపారు. ట్యాబుల పంపిణీ అంత ఆషామాషీ విషయం కాదన్నారు. రాష్ట్రంలో నాడు - నేడు పనుల ప్రగతిని వివరించారు. గిరిపుత్రుల స్వచ్ఛమైన మనసుల మధ్య, తనకు కొండంత అండగా నిలబడే అడవితల్లి బిడ్డల మధ్య, పేదల బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం ఒక గొప్ప కార్యక్రమం చింతపల్లి వేదికగా తలపెట్టినట్లు తెలిపారు. పాడేరులో బ్రిడ్జిలు, రోడ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సాలూరులో మొట్టమొదటసారిగా ట్రైబల్ యూనివర్సిటీ నిర్మాణం శరవేగంగా జరుగతోందన్నారు. పార్వతీపురం, నర్సీపట్నం, పాడేరులో మూడు మెడికల్ కాలేజీలు వస్తున్నాయని తెలిపారు. ఐటిడిఎ పరిధిలో పార్వతీపురం, సీతంపేట, రంపచోడవరం, బుట్టాయిగూడెం, డోర్నాలలో కూడా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం వేగంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, అరకు ఎంపీ మాధవి, పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడికక్కడ నిర్బంధం

సిఎం పర్యటన నేపథ్యంలో సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం, సిఐటియు నేతలను పోలీసులు ఎక్కడికక్కడ నిర్బంధించారు. పోలీసు, ప్రభుత్వ తీరును సిపిఎం అల్లూరి జిల్లా కమిటీ ఖండించింది.

పాడేరు: అల్లూరి సీతారామ రాజు జిల్లా చింతపల్లికి గురువారం ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పర్యటిస్తున్న నేపథ్యంలో సి.పి.ఎం జిల్లా కార్యదర్శి పి.అప్పల నర్స ను పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. తెల్ల వారు జామున 3 గంటలకే పాడేరులో ఆయన ఇల్లును పోలీసులు చుట్టు ముట్టారు. దీనిపై అప్పలనరస ఫోన్లో తన ఇంటి వద్ద నుంచి విలేకరులతో మాట్లాడుతూ, చింతపల్లిలో పర్యటిస్తున్న సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అపాయింట్‌మెంట్ ఇస్తామని హామీ ఇచ్చి ఆదివాసీ నాయకుల పై గృహ నిర్బందం సరికాదని అన్నారు. సి.ఎం ఆదివాసీలకు వంద శాతం రిజర్వేషన్ పై మౌనం వీడి చట్టబద్ధత కల్పించడంపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.



పాడేరులో గృహ నిర్బంధంలో అప్పలనర్స

అనంతగిరి: జెడ్పీటీసీ దీసరి గంగరాజును గురువారం ఇంటి వద్ద తెల్లవారుజామున 3 గంటలకు పోలీసులు చుట్టి ముట్టి నిర్బంధిచారు ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ పాలనను ప్రశ్నిస్తారనే భయంతో హౌస్ అరెస్ట్‌లు చేస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్ మోహన్ రెడ్డి గృహనిర్బంధాలతో భయభ్రాంతులను చేయడం మానుకోవాలన్నారు. గిరిజన సమస్యలపై ప్రశ్నించే గొంతు పై ఉక్కు పాదంతో అణిచి వేస్తారా మీకు చిత్తశుద్దుంటే జిఓ 3 రిజర్వేషన్ కు చట్టబద్ధత కల్పించి ఆదివాసీలకు వందశాతం రిజర్వేషన్ పై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ మాతృ భాష వాలంటరీలకు కనీస వేతనాలు 26వేలు ఇవ్వాలన్నారు.పివిటీజి లకు అంత్యోదయ రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు.పది రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు కనీసం వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు.



అనంతగిరిలో గంగరాజు గృహ నిర్బంధం

చింతపల్లి: గిరిజన సమస్యలపై సిఎం జగన్ కనీసం ప్రస్తావించకుండా గిరిజన ప్రాంతంలో సభ పెట్టడం ఎందుకని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ ప్రశ్నించారు. ఆయనను హౌస్ అరెస్టు చేయడంపై స్పందించారు. గిరిజనుల గొంతుక నొక్కే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. తాజంగి లో సిపిఎం మండల కార్యదర్శి పాంగి ధనుంజయని అదుపులో తీసుకున్నారు.

అరకులోయ రూరల్: ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ ను ఇంట్లో నుండి బయటకు వెళ్లకుండా పోలీసులు హౌస్ అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ, గిరిజన సంఘం నాయకులను హౌస్ అరెస్ట్ చేసి భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు.

పెదబయలు: గిరిజన సంఘం పూర్వ అధ్యక్షులు బోండా సన్నిబాబును గురువారం ఉదయం 5 గంటలకు ఆయన నివాసంలో గృహ నిర్బంధం చేశారు. స్థానిక పోలీసులు ఇంటిపై దాడీ చేసి చుట్టుముట్టి నిద్రపోతున్న సన్నిబాబును పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.చలిలో నడిపించుకొంటూ పోలీసు స్టేషన్ కు తరలించారు.ఈ సందర్భంగా సన్నిబాబు మాట్లాడుతూ, అరెస్టులకు భయపడేది లేదన్నారు.

సిపిఎం నేత సూరిబాబు గృహ నిర్బంధం

కొయ్యూరు : చింతపల్లిలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో గురువారం సిపిఎం జిల్లా నాయకుడు ఎస్.సూరిబాబును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ప్రభుత్వ, పోలీసు చర్యలను సూరిబాబు తీవ్రంగా ఖండించారు.

సిఎం పర్యటనతో ప్రజలకు ఇక్కట్లు

చింతపల్లిలో మూతపడిన దుకాణాలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: సీఎం పర్యటన అంటేనే ప్రజలకు ఆంక్షలు, ఇక్కట్లు గుర్తొస్తున్నాయి. పోలీసులు వాహనాలు మళ్లించడం, ప్రయాణికుల సమయం వృథా కావడం, ట్రాఫిక్ నిలిచిపోవడం పరిపాటిగా మారింది. గురువారం నాటి జిల్లా పర్యటనలోనూ అడుగడుగున ఆంక్షలు పెట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారం నాటి జిల్లా పర్యటనలోనూ అడుగున ఆంక్షలు పెట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దుకాణాలు బంద్ చేయడం రోడ్డు పొడవునా భారీ కేడ్లు ఏర్పాటు చేయడం, జన సమీకరణకు ఆర్‌టిసి బస్సులను, ప్రైవేటు వాహనాలను వినియోగించారు. దీంతో చిరు వ్యాపారులు, కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు విద్యార్థులతో పాటు సొంత పార్టీ శ్రేణులకు కూడా అవస్థలు తప్పడం లేదు. చింతపల్లిలో బుధవారం మధ్యాహ్నం నుంచే రహదానాలు దిగ్బంధించారు. గురువారం ఉదయం కూడా ట్రాఫిక్ ఆంక్షలుతో ఆస్పత్రులకు వెళ్లే రోగులు సైతం అసౌకర్యానికి గురయ్యారు. జన సమీకరణ పై దృష్టి పెట్టిన అధికార పార్టీ నేతలు అధికారులు వసతులు కల్పించడంలో విఫలమయ్యారు.

చింతపల్లి సభలో సిఎం మాట్లాడుతుండగానే జనం వెళ్లిపోతుండడం కనిపించింది. ప్రసంగం మధ్యలోనే దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వెనుదిరిగారు. ప్రధాన ద్వారం వద్ద బయటకు పోలీసులు అనుమతించకపోవడంతో వేరే మార్గం ద్వారా భారీ కేడ్లను తీసి బయటకొచ్చేశారు.

సిఎం సభకు జనసమీకరణలో భాగంగా వందలాదిమంది విద్యార్థులను ఆయా పాఠశాలల నుంచి తరలించారు. సభ వద్ద బస్సు దిగగానే వారి చేతికి వైసిపి జెండాలు, ప్లకార్డులు అందజేశారు.

ట్రాఫిక్ ఆంక్షలతో అవస్థలు..

సిఎం పర్యటన సందర్భంగా చింతపల్లిలో విధించిన ట్రాఫిక్ ఆంక్షలతో ప్రజలకు అవస్థలు తప్పలేదు. చింతపల్లి పట్టణం లోపలికి ప్రవేశించే ప్రధాన రహదారి తో పాటు అన్ని మార్గాలను పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారు ఆ సమయంలో ప్రయాణించాల్సిన వారంతా ఇతర మార్గాల మీదుగా వెళ్లేందుకు అష్ట కష్టాలు పడ్డారు. వాహనాలను రెండు కిలోమీటర్ల దూరంలో ఆపేయడంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బంది పడ్డారు. ఆసుపత్రులకు వెళ్లే రోగులు సైతం అసౌకర్యానికి గురయ్యారు. సిఎం సభకు ప్రధాన రహదారి మీదుగా నడిచి వెళుతున్న ప్రజలను సహితం అడ్డుకోవడంతో వేరే ఇతర మార్గాలను వెతుక్కుని సభస్థలికి చేరుకున్నారు. సిఎం పర్యటనకు ఆర్ టిసి బస్సులను వినియోగించడంతో రవాణా ఇబ్బందులు తప్పలేదు. బహిరంగ సభకు వచ్చిన ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు భోజన సౌకర్యం కల్పించలేదు. చింతపల్లి ప్రధాన రహదారి పొడవునా దుకాణాలు మూసి వేయించారు. దీంతో దుకాణాల వ్యాపారులతోపాటు చిరు వ్యాపారులకు ఉపాధి లేకుండా పోయింది.



మూతపడిన దుకాణాలు



వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

అంగన్వాడీ కేంద్రాలను పాఠశాలలకు అటాచ్ చేయొద్దు

యుటిఎఫ్ నేతల వినతి

ప్రజాశక్తి - కూనవరం

అంగన్వాడీ కేంద్రాలను పాఠశాలలకు అటాచ్ చేయడం సరికాదని, ఆ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ అనసూయకు, ఎంపిడిఒకు గురువారం యుటిఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మె నేపథ్యంలో ఎటువంటి రాతపూర్వక ఉత్తర్వులు లేకుండా అంగన్వాడీ కేంద్రాలను పాఠశాలలకు అటాచ్ చేయడాన్ని, మిడ్డేమీల్స్ పెట్టాలని చెప్పడాన్ని తమ సంఘం వ్యతిరేకిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఎ.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పి.కన్నారావు, సహాధ్యక్షురాలు బి.సీత, కార్యదర్శులు సిహెచ్.సత్యవతి దేవి, కె.శాంత, జె.గౌతమి, టి.సుబ్బారావు పాల్గొన్నారు.

కోవిడ్‌పై ముందస్తు చర్యలు

ప్రజాశక్తి-అడ్డతీగల

దేశంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అడ్డతీగల ప్రభుత్వా ఆసుపత్రిలో ముందు జాగ్రత్తగా ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్, సెంట్రల్ ఆక్సిజన్ వ్యవస్థ, వెంటిలేటర్లు, ప్రత్యేక వార్డులు, టెస్టులకు కిట్లు సిద్ధం చేశామని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ సతీష్ తెలిపారు. గురువారం ఆయన ఏర్పాట్లును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ పట్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. ఎవరికైనా కరోన వచ్చిందని అనుమానం వస్తే ముందుగా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రచన, డాక్టర్ అనిల్, డాక్టర్ సాయిరాం, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైద్యులు

పివిటిజిలకు కొండ కింద పక్కా గృహాలు

చింతూరు ఐటిడిఎ పిఒ చైతన్య

ప్రజాశక్తి- చింతూరు

ఏజెన్సీలో వెనుకబడిన గిరిజన తెగలు (పివిటిజి) ప్రజలకు ప్రభుత్వం తరుపున కొండ దిగువన పక్కా గృహాలు నిర్మించి ఇస్తామని చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య తెలిపారు. మండలంలోని ఏడుగురళ్ళపల్లి సచివాలయం, ఉప్పనపల్లి గట్టు గ్రామ పరిధిలో కొండపైన కొండ రెడ్డిల కుటుంబాలు నివసిస్తున్న చింతల పాడు గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించారు. గ్రామస్తులతో సమావేశమై ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం గురించి వివరించారు. ఈ పథకం ద్వారా పివిటిజిలకు పక్కా గృహాలు నిర్మించి ఇస్తామని చెప్పడంతో వారు కొండ కిందకు వచ్చి నివసించడానికి సుముఖత వ్యక్తం చేశారు. చింతలపాడు ప్రైమరీ స్కూల్‌ను సందర్శించి అక్కడ విద్యార్థులతో ముచ్చట్టించారు. పివిటిజిలకు పైలట్ ప్రాజెక్ట్ ద్వారా కొత్త ఆధార్ కార్డులు జారీ, మార్పులు, చేర్పులు, రైతు భరోసా, అమ్మఒడి, కిసాన్ కార్డ్స్, పోస్టల్ బ్యాంక్ అకౌంట్ ద్వారా ఎన్ఆర్ఈజీఎస్ జాబ్ కార్డులు, ప్రభుత్వం ద్వారా అందించే అన్ని సేవలను కొండరెడ్లకు అందే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొత్తగా పోడు భూమి పట్టాలు మంజూరు చేయటం కోసం చింతల పాడు హబిటేషన్‌లో గ్రామసభ నిర్వహించారు. భద్రాచలం ఐటిడిఎ నుండి విడిపోయి కొత్తగా చింతూరు ఐటిడిఎ ఏర్పాటు చేసిన నాటి నుంచి ఏ ప్రాజెక్టు అధికారి తమ గ్రామానికి రాలేదని, ఎంతో ప్రయాస పడి ఇక్కడకు వచ్చిన చైతన్యకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూనవరం, విఆర్.పునం ఎంపీడీవోలు, కూనవరం ఎఫ్ఆర్ఓ, రెవెన్యూ, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.



పివిటిజి గిరిజనులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ చైతన్య



కొండలు, గుట్టలు ఎక్కి వెళ్తున్న పిఒ చైతన్య

అంగన్వాడీ కేంద్రంలో సరుకుల అపహరణ

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని మర్రిగూడెం అంగన్వాడీ కేంద్రంలో సరుకులు అపహరణకు గురైనట్లు అంగన్వాడీలు తెలిపారు. ఈ సెంటర్ తాళాలను అంగన్వాడీ సూపర్ వైజర్, సచివాలయ సిబ్బంది పగలగొట్టి తాళాలు వేయకుండా వెళ్లిపోయారు. అయితే అంగన్వాడీ కేంద్రాన్ని తెరిచినట్లు సమాచారం తెలుసుకున్న సంబంధించి వర్కరు, మిగిలిన అంగన్వాడీలు అక్కడకు వెళ్లి చూడగా, తలుపులు తెరిచి ఉన్నాయి. అంగన్వాడీ కేంద్రంలో విలువైన వస్తువులు పోయినట్లు గుర్తించారు. అంగన్వాడీ కేంద్రం వర్కర్‌కు సంబంధం లేకుండా తెరిచిన సూపర్ వైజర్, సచివాలయం సిబ్బందిపై కేసు నమోదు చేసి, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా అనేక గ్రామాల్లో ఇలాగే ఐసిడిఎస్ సూపర్ వైజర్లు, సచివాలయ సిబ్బంది తాళాలు పగల గొడుతున్నారని, ఆయా కేంద్రాల్లో సరుకులు అపహరణకు గురైన వారే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు కొమరం పెంటయ్య, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



తెరిచి ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సిఐటియు నేత పెంటయ్య, అంగన్వాడీలు



అటవీశాఖ సబ్బందితో సమావేశమైన ఇన్‌ఛార్జి రేంజర్ షెహన్ షా

ఇన్‌ఛార్జి రేంజర్‌గా షెహన్ షా

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రాజవొమ్మంగి ఇన్‌ఛార్జి రేంజర్‌గా ఎస్.షెహన్ షా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన రేంజర్ అబ్బాయిదొర సోషల్ ఫారెస్ట్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కొత్త రేంజర్‌ని సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. అనంతరం స్థానిక ఫారెస్ట్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. విధి నిర్వహణలో సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని, అడవులు పరిరక్షణకు కృషి చేయాలని సూసించారు. ఆరోగ్యకరమైన అడవులను గ్రామస్తులు కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓలు రాము, బాలాజీ, అర్జునుడు, సుబ్బయ్యమ్మ, ఎఫ్‌బిఒలు ప్రసాదు, నాగేశ్వరరావు, అప్పారావు, నరేష్, ఈశ్వరరావు, ఈశ్వరుడు, రామారావు, రైటర్ మధు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో బిఎస్ఎన్ఎల్ 4జి సేవలు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలో బీఎస్ఎన్ఎల్ 4జి సేవలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు బీఎస్ఎన్ఎల్ సెంట్రల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు నర్సి కిరణ్ తెలిపారు. ఈ మేరకు గురువారం కొయ్యూరులో బీఎస్ఎన్ఎల్ అధికారులతో కలిసి మండలంలోని పలు బీఎస్ఎన్ఎల్ టవర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ అధికారులు కళ్యాణ్ శ్రీనివాస్, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

సీలేరులో క్రిస్మస్ సందడి

ప్రజాశక్తి -సీలేరు : క్రిస్మస్ పండగ దగ్గర పడడంతో జీకే వీధి మండలం సీలేరులో క్రైస్తవుల్లో సందడి వాతావరణం నెలకొంది. చిన్నారులు పలువురిని ఆకట్టుకునే విధంగా క్రిస్మస్ తాత వేషధారణలో రాత్రి సమయంలో పురవీధుల్లో తిరుగుతూ క్రిస్మస్ విశిష్టతను చాటి చెబుతూ సందడి చేస్తున్నారు. ముందస్తుగానే క్రైస్తవులు పరస్పరం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ కేరింతలు కొడుతున్నారు. ఈ సందర్భంగా యూసిఐఎం పాస్టర్ మనసై మాట్లాడుతూ క్రిస్మస్ పండగ ముందు క్యారల్స్ అనే కార్యక్రమాన్ని ప్రతి ఏడాది చిన్నారులతో చేపడుతూ పురవీధుల్లో రాత్రి సమయంలో తిరుగుతూ ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమ క్రిస్మస్ ముందు రోజు రాత్రి వరకు సాగుతుందన్నారు.



క్రిస్మస్ తాత వేషధారణలో సందడి చేస్తున్న చిన్నారులు

గిరిజన సమస్యలపై ప్రస్తావన ఏదీ?

బైజూస్ ట్యాబుల పంపిణీ ప్రచారానికే సిఎం జగన్ వచ్చారా?

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర



విలేకర్లతో మాట్లాడుతున్న ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి - అరకులోయ రూరల్: చింతపల్లి పర్యటనలో జగన్ బై జ్యూస్ టాబ్ కంపెనీ ప్రచారానికి వచ్చినట్టు తప్ప ఆదివాసీ గిరిజనుల సమస్యలు ప్రస్తావించక పోవడం పట్ల ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర విమర్శించారు. గురువారం అరకులోయ ఆదివాసి గిరిజన సంఘం భవనంలో విలేకరులతో మాట్లాడుతూ, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులను అరెస్టులు, గృహ నిర్బంధాలపాలు పెట్టిన శ్రద్ధ ఆదివాసీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎందుకు లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చింతపల్లి పర్యటనలో సమస్యల ప్రస్తావన లేకుండా కేవలం బై జ్యూస్ టాబ్ కంపెనీకి ప్రచారానికి వచ్చినట్టు ఉందని విమర్శించారు. ముఖ్యమంత్రికి గిరిజన ప్రాంతాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు కనిపించ లేదని మండి పడ్డారు. సిఎం పర్యటన సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ నాయకుడు పి. అప్పలనర్స, జిల్లా ప్రధాన కార్యదర్శి పిలాబదేవ్, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ విన్నయ్య పడాల్, అనంతగిరి జడ్పీటీసీ డి.గంగరాజు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎల్ సుందర్ రావు, సన్నిబాబు, కె.సూరిబాబు, చిరంజీవిలను పోలీసులు గృహనిర్బంధంలో ఉంచడానికి ఆదివాసీ గిరిజన సంఘం తీవ్రంగా ఖండిస్తున్నదని అన్నారు. గృహ నిర్బంధాలతో ఉద్యమాలు ఆపలేరన్నారు. ప్రధాన మైన గిరిజన సమస్యలను జీఓ 3కు చట్టబద్ధత కల్పించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, గిరిజన స్పెషల్ డీఎస్సీ, హైడ్రోపవర్ ప్రాజెక్ట్ వంటి సమస్యలపై నోరు ఎత్తకపోవడంతో గిరిజనులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో కలపాలని, 60 కోట్ల కాఫీ రైతుల బకాయిలు వెంటనే విడుదల చేసి రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్య పై ఎందుకు నోరు విప్పలేదని అన్నారు. తుపాన్ కారణంగా నష్టపోయినా రైతులకు అందునా వేరి నేటి వరకు పరిహారం అందించలేదన్నారు.మాగీ భాష విద్య వలంటీర్ల కనీస వేతనాలు 36 వేలు ఇవ్వాలని డిమాండ్ డిమాండ్ చేశారు.పాడేరు ఐటిడిఏ పరిధిలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాల, మండల పరిషత్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 1500 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం బై జ్యూస్ ట్యాబ్ కోసం ప్రచారర్భాటం చేస్తోందన్నారు. పాడేరు ఐటిడిఏ పరిధిలో నూతన విద్యా విధానం పేరుతో 107 పాఠశాలలు మూసేసారన్నారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు కుర్ర మగ్గన్న, బురిడీ థశరద్, పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు అన్యాయం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: అల్లూరి జిల్లా చింతపల్లిలో సీఎం జగన్మోహన్ రెడ్డి పర్యటనకు భంగం కలిగిస్తారన్న నేపంతో పోలీసు శాఖ ను ప్రయోగించి అల్లూరి జిల్లా కార్యదర్శ అప్పల నర్స , అనంతగిరి జడ్పిటిసి గంగారాజు లతోపాటు సిపిఎం, గిరిజన సంఘం, సిఐటియు నేతలను పోలీసులు నిర్బంధించి అక్రమంగా అరెస్టులు చేయడం సరికాదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు తీవ్రంగా ఖండించారు. అంగన్వాడీలు సమ్మె నేటికీ పది రోజులు చేపడుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని విమర్శించారు. గత ఎన్నికల్లో ప్రచార భాగంలో జగన్మోహన్‌రెడ్డి అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. చింతపల్లి ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల అనుమతులు వెనక్కి తీసుకోవాలని, గిరిజన ప్రాంతంలో భూగర్భ ఖనిజాలు, అడవులను కార్పోరేట్ సంస్థలకు కట్టబట్టేందుకు సీఎం జగన్ రెడ్డి పర్యటన చేపడుతున్నారని విమర్శించారు. ఈ మేరకు సిపిఎం మండల కార్యదర్శి భీమరాజు, మండల వైస్ ఎంపీపీ పాటుబోయి సత్యనారాయణ, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను, సిఐటియు మండల కార్యదర్శి కొర్ర శంకర్‌రావు, గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షుడు గల్లేల నారాయణ, జీనాబంధు, చందర్ తీవ్రంగా ఖండించారు.

ఘనంగా సిఎం జగన్ జన్మదిన వేడుకలు



రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేస్తున్న అశ్వద్ధామ

ప్రజాశక్తి-అరకులోయ: రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం అరకలోయలో ఏఎంసి డైరెక్టర్ కిరసాని రాందాస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద కిరసాని రాందాస్ ఆధ్వర్యంలో విశాఖ ఏయు ప్రొఫెసర్ పి.అర్జున్, వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ సమర్ధి రఘునాథ్, కొర్ర రామారావు, గాసి తదితరులు కేక్ కట్ చేసి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సుమారు 200 మంది నిరుపేదలకు కిరసాని రాందాస్ బృందం రగ్గులను, చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు, జగన్ అభిమానులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం అగ్ర గామిగా నిలిచిందని గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జపరంగి అశ్వద్ధామ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా అరకులోయ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు రొట్టెలు, పాలు, పండ్లు అందజేశారు. ప్రతీ వార్డులో పర్యటించి రోగుల క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత నాలుగున్నర ఏళ్లగా ముఖ్యమంత్రి జగన్ పాలనలో రాష్ట్రం ఎంతో సుభిక్షంగా ఉందని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆనందమయమైన జీవితాన్ని గడుపుతున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో జగన్మోహన్ రెడ్డి ఆదర్శంగా తీసుకొని సామాన్య పేద మధ్యతరగతి ప్రజల అభ్యున్నతి కోసం తన వంతు కృషి చేస్తున్నారని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో చినలబుడు పంచాయితీ సర్పంచ్ బురిడీ ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలో కొండిభ పంచాయతీ కపాటివలస గ్రామంలో జిల్లా పరిషత్ నిధులు 2 లక్షల నిధులతో సిసి డ్రైనేజీ నిర్మాణానిక స్థానిక జడ్పిటిసి గంగరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొండిభ పంచాయతీ కపాటివలస, బల్యగుడ పరిధిలో సుమారుగా 8 గ్రామాలు ఉన్నాయని, రోడ్డు తుఫానులో కొట్టుకు పోయి అస్తవ్యస్తంగా ఉండడంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కలెక్టర్, జిల్లా పరిషత్ చైర్మన్‌ల దృష్టికి తీసుకు వెళ్లి నిధులు మంజూరు కోసం గంగరాజు ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో టోకురు సర్పంచ్ కిల్లో, మోస్య, టోకురు మాజీ సర్పంచ్ సార, దొన్ను అనంతగిరి సిపిఎం మండల కార్యదర్శి సోమెల, నాగులు, నరాజీ సురేష్, టిడిపి నాయకులు కిల్లో.రాజు, జన్ని చిరంజీవి, అప్పన్న తదితరులు పాల్గొన్నారు

బిఎస్ఎన్ఎల్ సేవలు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని తాడేపూట్టు పంచాయతీలో పరిధిలోని గ్రామాలకు బిఎస్ఎన్ఎల్ నెట్ సౌకర్యం పూర్తిస్థాయిలో కల్పించాలని టిడిపి యూనిట్ ఇన్చార్జి సోమేలి లక్ష్మయ్య కోరారు. గురువారం ఆయన పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు తుఫాన్ ప్రభావం నుండి నేటి వరకు సుమారు పది రోజులవుతున్నా నెట్ వర్క్ పని చేయలేదన్నారు. అధికారులు స్పందించి సేవలను పూర్తిస్థాయిలో అందించాలని ఆయన కోరారు.

దిగి రాకుంటే దింపేస్తాం...

ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బేబీరాణి

పదో రోజున కొనసాగిన నిరవధిక సమ్మె... వినూత్న రీతిలో నిరసనలు



రంపచోడవరంలో దీక్షల్లో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బేబీరాణి



డుంబ్రిగుడలో అంగన్వాడీల మానవహారం

ప్రజాశక్తి-రంపచోడవరం : అంగన్వాడీల న్యాయమైన సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కారం చేయకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షుల బి.బేబిరాణి హెచ్చరించారు. అంగన్వాడీల సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఆందోళన 10వ రోజుకు చేరింది. ఈ శిబిరాన్ని సందర్శించిన బేబిరాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలపై చర్చలకు పిలిచి ఏ ఒక్క డిమాండ్ పరిష్కారం చెయ్యలేదన్నారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో సమ్మె చేయాల్సి వచ్చిందని చెప్పారు. అంగన్వాడీలకు కనీస వేతనం, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కలిపించాలని డిమాండ్ చేశారు. మిడ్డేమీల్స్ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమం యూనియన్ నాయకులు ఇ.చంద్రావతి, పద్మ, సిఐటియు నాయకులు షేక్ బాజ్జి పాల్గొన్నారు.

మారేడుమిల్లి : అంగన్వాడీల పదో రోజు ఆందోళనకు యూనియన్ అధ్యక్షురాలు బేబీ రాణి, సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్, యుటిఎఫ్ మండల నాయకులు గురువారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బేబిరాణి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్ మాట్లాడుతూ అంగన్వాడీలు ఒకపక్క ధర్నాలు చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం రౌడీయిజం చేస్తూ అంగన్వాడీ కేంద్రాల తాళాలు బద్దలుగొట్టడం దారుణమన్నారు. ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకుంటే రానున్న ఎన్నికల్లో వారి సత్తా ఏమిటో చూపిస్తారని హెచ్చరించారు.

చింతూరు : మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన 10వ రోజు ఆందోళనను యుటిఎఫ్ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పండ కృష్ణయ్య, ఊర్మ వెంకటనారాయణ, బొగ్గా ముత్తయ్య, బాలారెడ్డి, సీతరెడ్డి, తులసి, గంగాదేవి, రత్నకుమారి, సీఐటీయూ మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్, యూనియన్ నాయకులు వెంకటరమణ, దుర్గ, సత్యవతి, చిట్టమ్మ, కన్నకదుర్గ, కామేశ్వరి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక : పది రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు గురువారం మానవహారం చేశారు. గౌరవ వేతనం వద్దు - కనీస వేతనం ముద్దు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూనెం సత్యనారాయణ, సిపిఎం నాయకులు లాలారపు ప్రకాష్‌రావు, ఆకిసెట్టి రాము, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు

కొయ్యూరు : కొయ్యూరు మండల కేంద్రంలో అంగన్వాడీలు చేస్తున్న ఆందోళన శిబిరాన్ని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు గురువారం సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు వై.అప్పలనాయుడు, సిపిఎం జిల్లా నాయకులు ఎస్ సూరిబాబు, అంగన్వాడీలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



విఆర్.పురంలో అంగన్వాడీల వంటావార్పు

రాజవొమ్మంగి : అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి 10వ రోజుకు చేరింది. స్థానిక ఆర్అండ్బి అతిథి గృహం ఎదురుగా ఏర్పాటు చేసిన దీక్ష శిబిరాన్ని యుటిఎఫ్, సిఐటియు, డివైఎఫ్ఐ నాయకులు యు.మనోహర్, బొజ్జయ్య, పి.రామరాజు, టి.శ్రీను సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.వెంకటలక్ష్మి, ఎల్ సత్యవతి, నూకరత్నం, కె లక్ష్మి, చిన్నమ్మలు, రమణి, రమణ, రత్నం, రాజేశ్వరి, మంగ, రాధ, పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

విఆర్.పురం : రేఖపల్లి కూడలిలో అంగన్వాడీలు చేపట్టిన ఆందోళన గురువారం నాటికి పదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వంటా వార్పు చేసి అక్కడే భోజనాలు చేశారు. వీరి ఆందోళన శిబిరాన్ని ఎంపిపి కారం లక్ష్మి, ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ పద్మ, నాయకులు సున్నం పార్వతి, రంగమ్మ, దారమ్మ, సిపిఎం నాయకులు మేకల, నాగేశ్వరరావు, పాయం సీతారామయ్య, కూనవరం వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సున్నం రంగమ్మ, నాగమణి, రాజేశ్వరి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

అంగన్వాడీల మానవహారం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడిలు చేపడుతున్న సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ జంక్షన్ వద్ద అంగన్వాడిలు మానవహారం నిర్వహించారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కే.కొండమ్మ, సత్యవతి, జి.పవిత్ర, మీనా, బుజ్జి అంగన్వాడి కార్మికులు, హెల్పర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండలం కేంద్రంలో నిర్వహిస్తున్న అంగన్వాడీల పదోవ రోజు సమ్మెను కొనసాగించారు. లక్ష్మీపురం సర్పంచ్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొర్ర త్రినాథ్, గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఎంఎం శ్రీను మద్దతు తెలిపారు. అంగన్వాడీలకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి శంకర్రావు, అంగన్వాడి సంఘం నేతలు పాల్గొన్నారు.


హుకుంపేట: మండలంలోని మహిళ సంఘం అల్లూరు జిల్లా కార్యదర్శి ఎస్.హైమావతి, హుకుంపేట వైస్ ఎంపీపీ ఆధ్వర్యంలో అంగన్వాడీ సమ్మె సందర్భంగా వంటా వార్పు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చి అంగన్వాడి మహిళలకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ అంగన్వాడీ యూనియన్ నాయకురాలు కొండమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

నల్ల బెలూన్లతో నిరసన

చింతపల్లి: చింతపల్లిలో అంగన్వాడీలు నల్ల బెలూన్లతో రోడ్ల నిచ్చోని ఐసిడిఎస్ ఎదురుగా నినాదాలు చేశారు. చింతపల్లి వచ్చిన జగన్ సమ్మె చేస్తున్న అంగన్వాడీలను దృష్టిలో పెట్టుకొని మాట్లాడకపోవడం అన్యాయమన్నారు. అంగన్వాడి యూనియన్ ప్రెసిడెంట్ పెంటమ్మ రాములమ్మ సీఎం జగన్ కి వినతిపత్రం ఇచ్చారు. కొన్ని సమస్యలు పరిష్కారం చేశాం.. మిగతా సమస్యలు ఒకటి ఒకటి పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని అంగన్‌వాడీలు తెలిపారు. అసలు డిమాండ్లు పక్కనపెట్టి మిగతా డిమాండ్ల పరిష్కారం చేయటమంటే సమ్మెను విచ్చినం చేయడమేనని వారు మండిపడ్డారు. తమ సమ్మె సమస్యలు పరిష్కారం అయ్యే వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అల్లూరు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్, వరలక్ష్మి, చెల్లయమ్మ, సత్యవతి, లక్ష్మి, అంగన్వాడీలు పాల్గొన్నారు



కొయ్యూరులో అంగన్వాడీల సమ్మె



మారేడుమిల్లిలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్



ఎటపాకలో అంగన్వాడీల మానవహారం

చిన్నారుల భద్రతకు సమిష్టి కృషి

ఎయులో పోక్సో చట్టంపై అవగాహనకు మూట్ కోర్టులో సిపి రవిశంకర్

ప్రజాశక్తి- విశాఖపట్నం : చిన్నారుల భద్రతకు సమిష్టిగా పనిచేయాలని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పిలుపునిచ్చారు. గురువారం ఎయు న్యాయ కళాశాల, విశాఖ పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యాన పోక్సో చట్టంపై మూట్ కోర్టు ప్రజెంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి రవిశంకర్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహణకు యువతతో కలసి పనిచేస్తామన్నారు. న్యాయ విద్యార్థులు సామాజిక బాధ్యతతో నడచుకోవాలన్నారు. చిన్నారులపై లైంగిక వేధింపుల సంఘటనల్లో అవసరమైన ఆధారాలు సేకరించి, న్యాయస్థానాలలో రుజువుచేయడం, నిందితులకు శిక్షలు పడేలా చేయాల్సిన అవసరం ఉందని, దీనికి పోలీసుశాఖ విశేషకృషి చేస్తుందన్నారు. యువతలో చైతన్యం పెంపొందిచే కార్యక్రమాలతో వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు పోలీసుశాఖ పాటుపడుతుందన్నారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి, ఎయు రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆచార్య ఎస్.సుమిత్ర, ఆచార్య రాజ్యలక్ష్మి, ఆచార్య కె.సీతామాణిక్యం తదితరులు మాట్లాడారు.

అనంతరం వివిధ సంఘటలపై న్యాయస్థానాలలో జరిగే వాదనలు నమూనాను (మూట్ కోర్ట్) విధానాన్ని ఎయు న్యాయ కళాశాల విద్యార్థులు ప్రత్యక్షంగా చేసి చూపించారు. బాధితులు, నిందితుల తరుపున వాదోపవాదాలు జరిపే విధానం, న్యాయమూర్తులకు సాక్ష్యాధారాలను అందించి, నిందితులకు శిక్షపడే పద్దతులు వంటి న్యాయస్థానం పనిచేసే విధానాన్ని కళ్లకు కట్టినట్టు చూపారు. కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు, ఎయు సిబ్బంది, న్యాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



ఎయు న్యాయకళాశాలలో మ్యూట్ కోర్టులో పాల్గొన్న సిపి రవిశంకర్; ఎయు విసి

మత్స్య వ్యర్థాలతో బహుళ ప్రయోజనాలు

గీతంలో అమెరికన్ వర్సిటీ పరిశోధకురాలు డాక్టర్ కె.దీప



డాక్టర్ దీపను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి -మధురవాడ : సముద్ర ఆహారం మత్స్యసంపద నుంచి వేరుపడే వ్యర్థాల నుంచి ఎన్నో ప్రయోజనాలున్నాయని అమెరికాలోని క్రిస్టియన్ బ్రదర్స్ యూనివర్సిటీ, మెకానికల్ ఇంజనీరింగ్ పరిశోధకురాలు డాక్టర్ కె.దీప వెల్లడించారు. గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ, మత్స్య పరిశ్రమలో చేపల చర్మం, రెక్కలు, ఎముకలు వంటివి వ్యర్థాలను వేరుచేస్తారన్నారు.ప్రపంచ వ్యాప్తంగా 8 మిలియన్ టన్నుల మత్స్యవ్యర్థాలు పరిశోధకులను ఆకర్షిస్తున్నాయన్నారు. మత్స్యాల నుంచి సేకరించే కొల్లిజన్, హైడ్రాక్సి ఎపటైట్ వంటి పదర్థాలు సౌందర్య సాధనాలు, బయో మెడికల్ రంగంలో వివిధ ఉత్పత్తులకు వాడుతున్నారని వెల్లడించారు. మత్స్యవ్యర్థాలతో తరహా ఫైబర్ తరహ నూతన పదార్థాలతో బహుళ ప్రయోజనాలున్నాయన్నారు మత్స్య పరిశ్రమ అధికంగా ఉండే ఆంధ్రప్రదేశ్‌లో పరిశోధకులు ఆయా అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ వి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కోఆర్డినేటర్లు డాక్టర్ జె.సరోజిని, ఎస్.హేమంతకుమార్ పాల్గొన్నారు.

ఎసిబి వలలో హెడ్ కానిస్టేబుల్

- రూ.ఐదు వేలు లంచం తీసుకుంటూ చిక్కిన వైనం

ప్రజాశక్తి -గాజువాక : రూ.ఐదు వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధకశాఖ అధికారులకు గాజువాక పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పట్టా రాజశేఖర్ గురువారం చిక్కారు. ఎసిబి డిఎస్‌పిరమ్య ఆధ్వర్యంలో పక్కా నిఘాతో మాటువేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాలివి.

గాజువాక చెందిన షేక్ రసూల్ అనే వ్యక్తి ఇంట్లో తగాదాలు కారణంగా ఆయన తండ్రిపై దాడి చేశాడు. దీనిపై బాధితుడు గాజువాక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది.రూ.ఐదు లక్షలు లంచమిస్తే కేసు లేకుండా చేస్తానని రసూల్‌పై ఒత్తిడి తేగా, అతను ఎసిబిని ఆశ్రయించారు. దీంతో ఎసిబి డిఎస్‌పి రమ్య ఆధ్వర్యంలో గాజువాక పోలీస్‌స్టేషన్ బయట మాటువేసిన ఎసిబి యంత్రాంగం, హెడ్‌కానిస్టేబుల్ రాజశేఖర్‌కు లంచం ఇస్తుండగా, రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

కాగా గాజువాక పోలీస్‌స్టేషన్‌లోరైటర్‌గా పనిచేస్తున్న సమయంలో రాజశేఖర్‌పై అనేక అవినీతి ఆరోపణ రావడంతో రైటర్ సీట్ నుండి తప్పించారు. ఇపుడు ఒక కేసు విషయంలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు.

నేడు స్పందన రద్దు

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- పాడేరు : జిల్లాలో ఈనెల 22న జరుగనున్న జగనన్నకు చెబుదాం స్పందన ప్రత్యేక కార్యక్రమం అనివార్య కారణాలతో రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి, ఎన్నికల రోల్ అబ్జర్వర్ జె.శ్యామలరావు జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం సమీక్ష నిర్వహించనున్నందున స్పందన రద్దు చేయడం జరిగిందని, ప్రజలు ఈ విషయం గమనించి శుక్రవారం స్పందనకు హాజరు కారాదని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

కొనసాగుతున్న సమ్మె

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేపడుతున్న సమ్మె మండలంలో కొనసాగింది.20 నుంచి విధులు బహిష్కరించి జిల్లా కేంద్రంలో ఆందోళనలు చేపడుతున్నారు.

వైకుంఠద్వార దర్శనానికి విస్తృత ఏర్పాట్లు



ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఇఒ

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్న అలయంలో ఈనెల 23న వైకుంఠ ద్వార దర్శనానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఇఒ శ్రీనివాసమూర్తి తెలిపారు. గురువారం వివిధ విభాగాధిపతులతో కలసి క్యూలైన్లు, తాగునీరు, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. పలు అంశాలపై చర్చించారు. 23న శనివారం వేకువజామున 5 30 గంటల నుంచి 11.30గంటల వరకు ఉత్తర ద్వార దర్శనాన్ని కల్పిస్తామన్నారు. క్యూలైన్లలో భక్తులు ఎక్కువ సేపు వేచియుండకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆ రోజున ఆర్జిత సేవలు, అంతరాలయ దర్శనాలను రద్దు చేస్తామన్నారు కొండ దిగువనున్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠద్వార దర్శన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో.ఇఇలు శ్రీనివాసరాజు, రాంబాబు, డిఇఇ హరినాగేశ్వరరావు , ఎఇఇ బాబ్జి, దేవస్థానం ఎఇఒ నర్సింహరాజు, పాలూరి నరసింగరావు, పర్యవేక్షకులు రమణ, కనకరాజు, పిఆర్ఒ నాయుడు ఉన్నారు.

నేటికీ అందని నవంబర్ నెల జీతాలు

- జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల ఆవేదన

ప్రజాశక్తి- విశాఖపట్నం : క్రిస్మస్ పండగ దగ్గరికి వస్తున్నా తమకు నవంబర్ నెల వేతనాలు ఇంకా అందకపోవడంతో వైద్యఆరోగ్యశాఖ నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. దసరా, దీపావళి, ఇపుడు క్రిస్మస్ ఇలా అన్ని పండగలకు సకాలంలో వేతనాలు అందకపోవడం వల్ల కుటుంబాలతో ఇబ్బందులు పడుతున్నామని నేషనల్ హెల్త్‌మిషన్ ఉద్యోగుల యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు గోపి, వీరబ్రహ్మం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 196 కేడర్‌లతో 22వేల మంది ఎన్‌హెచ్‌ఎంలో విధులు నిర్వహిస్తుండగా, ఉమ్మడి విశాఖలో 1500మందికి పైగా ఈ విభాగంలో పనిచేస్తున్నారు.తమకు కేంద్రం, రాష్ట్రం 60: 40 నిష్పత్తిలో వేతనాలు చెల్లించాల్సి ఉందని, అయినా ప్రతినెలా సకాలంలో వేతనాలు అందక ఆలస్యం కావడంతో అవస్థలు పడక తప్పడం లేదని వాపోతున్నారు. వేతనాలు సక్రమంగా అందకపోవడం వల్ల ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు, నిత్యావసరాలు, ఇలా నెలవారీ కుటుంబపోషణ వ్యవహారాలన్నీ ఎలా సాగుతాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ప్రతినెలా ఒకటోతేదీన వేతనాలు చెల్లింపు చర్యలు చేపట్టాలని, అలాగే ప్రస్తుతం క్రిస్మస్‌కు వచ్చేనెలలో వచ్చే సంక్రాంతి ముందే వేతనాలు చెల్లింపునకు చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు. దీనిపై నేషనల్ హెల్త్ మిషన్ ఎండి, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ తక్షణ చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.